
24022024-DIS-08_Layout 1 2/24/2024 4:02 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com



నేడు సంత్ రవిదాస్ జయంతి

భారతదేశ తాత్విక ఉద్యమాల్లో భక్తికవులది ఓ అధ్యాయం. పద్నాలుగో శతాబ్దం నాటికి భారత దేశంపై విదేశీ రాజులు ఆక్రమణకు దిగారు. బలవంతపు మత మార్పిడులు జరుగుతున్న కాలమది. హిందూ సమాజంలో కులం పేరుతో అసమానతలు, అంటరానితనం తీవ్రంగా ఉన్న రోజులవి. అటువంటి సమయంలో జన్మించిన రవిదాస్ తన భక్తిగీతాలతో భక్తి ఉద్యమానికి తెరతీసి ఎందరినో ఆ మార్గంలో నడిపించారు. మన దేశానికి దిశానిర్దేశం చేశారు.

# సమతామూర్తి సంత్ రవిదాస్



బైరి వెంకటేశం మోచి
94919 94090

ఎవరైతే తమ భావజాలంతో ఇతరులను ప్రభావితం చేస్తారో వాళ్లే చరిత్ర మలుపులో నిలబడి రాబోయే తరానికి దిశానిర్దేశం చేస్తారు. అలాంటి వారిలో రవిదాస్ ఒకరు. అందుకే రవిదాస్ భక్తులు ఆయన బంగారు విగ్రహాన్ని జలంధర్ నుంచి కాశీ వరకు మోసుకొచ్చారు. అంబేద్కర్ కూడా స్ఫూర్తిగా తీసుకున్న మహనీయుడాయన.

సంత్ రవిదాస్ భక్తికవుల్లో ఆధ్యాత్మిక భావాన్నే కాకుండా సామాజిక భావాలనూ కలిగించారు. బానిస భావాలను ఆయన వ్యతిరేకించారు. మానసిక, కుల, శారీరక బానిసత్వాన్ని వ్యతిరేకించారాయన. మనిషి స్వతంత్రుడిగా జీవించాలనేది ఆయన భావన. ప్రతి మనిషిలోనూ చైతన్యాన్ని రగిలించేందుకు కృషి చేశారు సంత్ రవిదాస్. మానవతాపూర్ణంగా మనిషి ఉండాలని తన కవిత్వంతో, తన పాటలతో ఆయన ప్రపంచానికి చాటారు. జీవితాంతం సమాజాన్ని మేల్కొలిపే బాటలోనే పయనించారు.

సంత్ రవిదాస్ క్రీ.శ. 1377లో కాశీ వద్ద ఉన్న సీర్ గోవర్ధనపురంలో మాఘపూర్ణిమ రోజున జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కలసాదేవి, సంతోఖ్‌దాస్ అణగారిన చర్మకార వర్గానికి చెందినవారు. కబీర్‌కు సమకాలికుడైన రవిదాస్ ఆధ్యాత్మిక సన్యాసిగానే అంటరానివారి అభ్యున్నతి కోసం ఉద్యమాన్ని నడిపారు. వారి సాంఘిక విముక్తి కోసం కృషి చేశారు. సామాన్యులే కాదు, శ్రీకృష్ణుని ఆరాధించే అంతఃపురవాసి మీరాబాయి లాంటి వారెందరో రవిదాస్ వెంటనడిచారు. ఆయన పదాల ప్రవాహం బనారస్ దాటి ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్ వరకు చేరాయి. భక్తకవిగా, ప్రవక్తగా ఆయన చేసిన పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం.

రవిదాస్‌కు కాశీ మహారాజు, మహారాణి కూడా శిష్యులే. జీవితాంతం చర్మకార వృత్తిని అవలంబిస్తూనే అత్యంత నిరాడంబరంగా బతికారు రవిదాస్. చిత్తోడ్ రాజు రాణా సంగా అభ్యర్థన మేరకు అక్కడికి వెళ్లిన ఆయన తన 120వ ఏట భగవంతునిలో లీనమయ్యారని చెప్తారు.

సమానో మంత్ర.. అనే వేదసారమంతా రవిదాస్ పదాలలో ఉంది. 'కులం గురించి ఎవరు, ఎవర్నీ అడగకూడదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు.. అందరూ మనిషి కులానికి చెందినవారే. మానవత్వమే పరమ ధర్మం' అని ఆయన బోధించారు. సంత్ చెప్పే ప్రతీమాట.. అనుభవం, అధ్యయనం, అవగాహన, మానవతావాదం నుంచి పుట్టుకొచ్చినవే.

జాతి వైతాళికులైన అంబేద్కర్ లాంటి వారిపై రవిదాస్ ప్రభావం చాలా ఉంది. రవిదాస్ ఒక వ్యక్తి కాదు, ఒక ఉద్యమం. సామాజిక సమరసత కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ ఆయన ఒక ఉత్తేజం. పదవుల లాలసతో విభజన, విద్వేష రాజకీయాలు గ్రామీణ ప్రజా జీవితాల్ని విచ్ఛిన్నం చేస్తున్న ప్రస్తుత తరుణంలో సంత్ రవిదాస్ బోధనలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నది. ఆయన కీర్తి, స్ఫూర్తిని ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణ భారత్‌లో కూడా యావత్ దళిత జాతి కొనసాగిస్తున్నది. రవిదాస్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచే ఆయనకు నివాళి అర్పించడమంటే యావత్ భారత జాతిని గౌరవించుకోవడమే.

# విజేతలు లేని యుద్ధం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శకుల్లో ఒకరైన అలెక్సీ నావల్నీ తాను నమ్మిన సిద్ధాంతాలకు అంతిమ మూల్యం చెల్లించుకున్న వ్యక్తిగా నిలిచారు. నావల్నీ మరణానికి ఆర్కిటిక్ జైలులో 'ఆకస్మిక మరణ సిండ్రోమ్' కారణమని రష్యా అధికారులు చెబుతున్నారు. కానీ, వ్లాదిమిర్ పుతిన్ అతన్ని జైలులో చంపి, ఆపై ఆనవాళ్లను కప్పిపుచ్చడానికి మృతదేహాన్ని దాచారని అతని భార్య ఆరోపించారు. పుతిన్ పాలనాకాలంలో రష్యాలో అలాంటి గొంతులు భారీ మూల్యం చెల్లించుకోవడం పరిపాటిగా మారింది.



ప్రొ.హర్ష్ వి పంత్



నావల్నీ మృతిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక పాశ్చాత్య దేశాలు దీన్ని 'హత్య' అని పిలుస్తున్నాయి. నావల్నీ మృతిపై అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని యూరోపియన్ యూనియన్ (ఈయూ) డిమాండ్ చేసింది. నావల్నీ మరణానికి అంతిమ బాధ్యత అధ్యక్షుడు పుతిన్, రష్యా అధికారులదేనని ఈయూ పేర్కొంది. రష్యా ప్రతిపక్ష నేత మరణానికి పుతిన్ కారణమని ఆరోపించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాస్కోపై అదనపు ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఉక్రెయిన్ యుద్ధ భూమిలో పెద్ద సంఖ్యలో రష్యన్ల ప్రాణాలు కోల్పోయినా యుద్ధాన్ని పుతిన్ కొనసాగిస్తున్నారు. పాశ్చాత్య రాజధానుల నుంచి వ్యతిరేకత వస్తున్నప్పటికీ, ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టిస్తున్నారు. రష్యాలో అసమ్మతిని, వ్యతిరేకతను అణచివేయడంలో ఆయన సఫలీకృతులయ్యారని, ఈ యుద్ధంలో ఆటుపోట్లు ఆయనకు అనుకూలంగా మారుతున్నాయని తెలుస్తోంది. గత వారం తూర్పు ఫ్రంట్‌లో ఉక్రేనియన్ దళాలు వెనక్కు తగ్గడం వల్ల పెద్ద మార్పేమీ కాకపోవచ్చు కానీ, ఇది కచ్చితంగా తూర్పు ఫ్రంట్‌లో రష్యన్ దళాలకు ధైర్యాన్ని ఇస్తుంది. ఇప్పుడు ఈ సెక్టార్‌లోని సరిహద్దు వెంబడి ఉక్రెయిన్ సైన్యం ఒత్తిడికి లోనవుతుంది.

ఎన్ని ఆంక్షలు, సవాళ్లు ఎదురైనా తన సైనిక సాహసాన్ని కొనసాగించడానికి రష్యా ఆర్థిక వ్యవస్థ పటిష్టత తోడ్పడుతుంది. రికార్డు స్థాయిలో ముడిచమురు విక్రయాలు కొనసాగుతుండటంతో పుతిన్ ఖజానా నగదుతో నిండిపోయింది. రష్యాలో ఆర్థిక వృద్ధికి ఈ యుద్ధం ఆజ్యం పోస్తోంది. గత ఏడాదిలో మొత్తం జీ7 కంటే వేగంగా రష్యా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందింది. 2024లోనూ ఇదే పరిస్థితి పునరావృతమవుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. పాశ్చాత్య దేశాలను ఇరుకున పెట్టడానికి పుతిన్‌కు ఈ పరిస్థితి వీలు కల్పించింది.

ఉక్రెయిన్‌కు ఇది ఒక సున్నితమైన పరిస్థితి. ఎందుకంటే ఆ దేశానికి మానవ వనరులు, మందుగుండు సామగ్రి సరిపడా లేదు. పాశ్చాత్య సహాయం కూడా తగ్గిపోతోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ మరిన్ని ఆయుధాల కోసం విజ్ఞప్తి చేస్తూ, 'కృత్రిమ ఆయుధాల కొరత' రష్యాకు మాత్రమే సహాయపడుతుందని నొక్కి చెప్పారు. ఉక్రెయిన్‌కు సహాయంపై ఇప్పటికే పాశ్చాత్య దేశాల్లో అంతర్గతంగా అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అమెరికాలో రాజకీయ విభేదాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తూర్పు ఫ్రంట్ నుంచి ఉక్రెయిన్ వెనక్కు తగ్గడానికి తమ సాయాన్ని అందించలేకపోవడమే కారణమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అంగీకరించారు. అయితే కాంగ్రెస్ ఆమోదించకపోవడంతోనే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. కానీ, రిపబ్లికన్ల వ్యతిరేకత నేపథ్యంలో ఆయన చేయగలిగిందేమీ లేదు. సమయం తనకు అనుకూలంగా ఉందని పుతిన్ గతంలో కంటే ఎక్కువగా విశ్వసిస్తున్నారు.

ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై విపరీతమైన ఒత్తిడిని పెంచుతూనే ఉంది. ఇది మరింత ఇబ్బందికరంగా పరిణమించకముందే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సి ఉంది. యుద్ధంతోనే సమస్యలు పరిష్కారం కావని, దానికి బదులుగా చర్చలు, దౌత్యం దిశగా ఒక మార్గాన్ని రూపొందించాలని భారత్ మొదటి నుంచి వాదిస్తోంది. ప్రస్తుతం రష్యా లాభాలు, ఉక్రెయిన్ విజయాలు తాత్కాలికమని గత రెండేండ్ల యుద్ధం, విధ్వంసం నుంచి గుణపాఠం నేర్చుకోవాల్సి ఉంది. ఈ యుద్ధంలో ప్రధాన పాత్రధారులు తమ చర్యలకు జరిగిన నష్టాన్ని గ్రహించి, సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ఉంది. ఉక్రేనియన్ అభద్రతలను, రష్యన్ ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని ఈ యుద్ధాన్ని పరిష్కరించాల్సి ఉంటుంది. ఆ దిశగా అందరూ కృషి చేస్తారని ఆశిద్దాం.

అనువాదం: స్వామి ఆర్వీవీయస్
(ఎన్డీ టీవీ సౌజన్యంతో)

ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై విపరీతమైన ఒత్తిడిని పెంచుతూనే ఉంది. ఇది మరింత ఇబ్బందికరంగా పరిణమించకముందే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సి ఉంది. యుద్ధంతోనే సమస్యలు పరిష్కారం కావని, దానికి బదులుగా చర్చలు, దౌత్యం దిశగా ఒక మార్గాన్ని రూపొందించాలని భారత్ మొదటి నుంచి వాదిస్తోంది.

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కావడం గ్రూప్-1 సీనియర్ అభ్యర్థుల పట్ల శాపంగా మారింది. గత ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో 503 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చింది. 2022 అక్టోబర్ 16న మొదటిసారి ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా.. పేపర్ లీక్ కారణంగా టీఎస్‌పీఎస్సీ దాన్ని రద్దు చేసింది. 2023 జూన్ 11న రెండోసారి ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా.. పరీక్షకు హాజరైన అభ్యర్థుల వేలిముద్రలను బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోలేదని హైకోర్టు మరోసారి పరీక్షను రద్దు చేసింది. ఆ కేసు తదనంతరం సుప్రీంకోర్టుకు చేరింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన టీఎస్‌పీఎస్సీ నూతన బోర్డు ఆగమేఘాల మీద సుప్రీంకోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకున్నది. దాంతోపాటు పాత నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో గ్రూప్-1 కొలువుల కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న సీనియర్ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

# ఇత్తేసి పొత్తు కూడటమంటే ఇదేనేమో!



ఎస్.శేఖర్
88852 33320

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, తెలంగాణలో గానీ ఇలా నోటిఫికేషన్ రద్దు చేసిన సందర్భాలు లేవు. 2011లో విడుదలైన గ్రూప్-1 నోటిఫికేషన్, పరీక్షపై కూడా ఎన్నో కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ 2016లో మళ్లీ పరీక్ష నిర్వహించి నియామకం చేపట్టారు. అంటే 2011 నుంచి 2016 మధ్యకాలంలో రాష్ట్ర విభజన జరిగినప్పటికీ నోటిఫికేషన్ మాత్రం రద్దు కాలేదు.


పేపర్ లీకేజీ కారణంగా రద్దు అయిన ఇతర పరీక్షల నోటిఫికేషన్లను టీఎస్‌పీఎస్సీ రద్దు చేయలేదు. కేవలం గ్రూప్-1 నోటిఫికేషన్‌పైనే చర్యలు చేపట్టడం దేనికి సంకేతం? నోటిఫికేషన్ న్యాయబద్ధంగా లేకుంటేనే దాన్ని రద్దు చేయాలి. ఇప్పటివరకు గ్రూప్-1 నోటిఫికేషన్‌లో తప్పు ఉందని ఎవరూ చెప్పలేదు. న్యాయస్థానాల్లోనూ కేసులు వేయలేదు. కోర్టు కూడా పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని మాత్రమే చెప్పింది.

టీఎస్‌పీఎస్సీ గ్రూప్- 1 నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు వెలువరించిన ప్రకటనలో 'ప్రజాభీష్టం మేరకే' అని ఉంది. 2022లో గ్రూప్-1కు దరఖాస్తు చేసుకున్న ఏ ఒక్క అభ్యర్థి కూడా నోటిఫికేషన్ రద్దు చేయాలని ఇప్పటివరకు కోరలేదు. ప్రజాభిప్రాయమే ముఖ్యమనుకుంటే, అభ్యర్థుల్లో 90 శాతం మంది తెలుగు ఆప్షనల్ పేపర్‌గా పెట్టాలని కోరారు. ప్రతి రాష్ట్రంలో వారివారి మాతృభాషను ఒక ఆప్షన్ పేపర్‌గా గ్రూప్-1లో పెడుతున్నారు. ప్రజాభీష్టం మేరకు అని చెప్పే ప్రభుత్వం మొదటగా దీన్ని అమలు చేయాలి కదా. మెయిన్స్ ఉర్దూలో రాసుకునే అవకాశం ఇస్తే ఒక వర్గం వారు అధికంగా లాభపడే అవకాశం ఉంది. కాబట్టి మెయిన్స్ పరీక్షను ఆంగ్లం, తెలుగులోనే నిర్వహించాలని 95 శాతం మంది కోరుతున్నారు. ప్రజాభీష్టం మేరకే అనుకుంటే.. దీన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు. అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్, ఆర్టీవో లాంటి పోస్టులకు జనరల్ డిగ్రీని అర్హతగా పరిగణించాలని 95 శాతం మంది అభ్యర్థులు కోరుతున్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి కదా. గ్రూప్-1 పోస్టులు అంటేనే అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు. మరి వాటికి ప్రత్యేక విద్యార్హత పెట్టాల్సిన అవసరం ఏమిటి?

2022 ఏప్రిల్‌లో నోటిఫై చేసి నోటిఫికేషన్ ఇచ్చి రెండుసార్లు పరీక్ష నిర్వహించిన పోస్టులకు.. 2022, 2023లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఎలా అర్హులవుతారని సీనియర్ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. రిజర్వేషన్ అమలు, అర్హత పరీక్ష పాసయ్యే సంవత్సరం.. తదితర లీగల్ విషయాలపై కోర్టులను ఆశ్రయించాలని గ్రూప్-1 సీనియర్ అభ్యర్థులు భావిస్తున్నారు. పాత నోటిఫికేషన్ అలాగే ఉంచి, కొత్తగా కలిపిన 60 పోస్టులను అనుబంధ నోటిఫికేషన్‌లో కొత్త రూల్ అఫ్ రిజర్వేషన్ ప్రకారం.. కొత్త, పాత అభ్యర్థులకు అవకాశం ఇస్తే బాగుండేది. లేదా గతంలో ఉన్న 503 పోస్టులు పాత రూల్ అఫ్ రిజర్వేషన్ ప్రకారం పాత అభ్యర్థులకే చెందేటట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంటే బాగుండేది. కొత్తగా గుర్తించిన 60 పోస్టులకు కొత్త రూల్ అఫ్ రిజర్వేషన్ ప్రకారం.. కొత్త, పాత అభ్యర్థులకు కలిపి అవకాశం ఇవ్వాలి. లేదా 60 పోస్టులకు కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలి.

ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ సర్కార్ వస్తూనే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నవారి కొలువుల ఆశలపై నీళ్లు చల్లింది. స్వరాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాలు సాధించాలని, కాంగ్రెస్ వస్తే తమకు న్యాయం జరుగుతుందని తీవ్రంగా శ్రమిస్తూ, ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న గ్రూప్-1 సీనియర్ అభ్యర్థులకు అన్యాయం చేయడం తగదు. కొత్తవాళ్ల కోసం పాత వాళ్లు బలైపోవాలా? అని సీనియర్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు.. గత ప్రభుత్వం ఇచ్చిన 503 పోస్టులకు బిచ్చం వేసినట్టు కేవలం 60 పోస్టులు కలిపి 'నోటిఫికేషన్ మేమే ఇచ్చాం' అని చెప్పుకోవడం సరికాదు. సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే ఊతపదంగా వాడే ఇత్తేసి పొత్తు కూడటమంటే ఇదేనేమో.




## దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నది. ఈడీ, సీబీఐలను విపక్షాలపై ఉసిగొల్పుతున్నది. బీజేపీకి ముప్పుగా మారిన కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించేందుకు మోదీ సర్కార్ శతవిధాలా ప్రయత్నిస్తున్నది. ఇప్పటివరకు ఈడీ నోటీసులతో భయపెట్టాలని చూసింది. కుట్రలు ఫలించకపోవడంతో ఇప్పుడు సీబీఐని రంగంలోకి దించాలని ప్రణాళికలు వేస్తున్నది.



- గోపాల్‌రాయ్, ఢిల్లీ మంత్రి

## ఎటమటం



### సబ్ పతా హై

ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రివర్గంలో స్థానం కోసం గడ్డం సోదరులు (వినోద్, వివేక్ వెంకటస్వామి), ప్రేమ్ సాగర్‌రావు ఢిల్లీలో లాబీయింగ్ చేయిస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను వివేక్ వెంకటస్వామి కలవగా.. 'డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు మీ సామాజిక వర్గం నుంచి ఇప్పటికే పదవులు ఇచ్చేశాం. ఇక ఆ కోటాలో ఎవరికీ ఇచ్చేది లేదు' అని స్పష్టం చేసినట్టు వినికిడి. 'నాకు పదవి ఇవ్వకపోయినా ఫర్వాలేదు. నా కుమారుడికి ఎంపీ టికెట్ ఇవ్వాలి' అని విన్నవించి ఆయన హైదరాబాద్‌కు తిరిగి వచ్చేశారు. ఆ తర్వాత గడ్డం వినోద్ వెళ్లి ఉపకులాల గురించి ప్రస్తావించగా.. సబ్ పతా హై అని ఖర్గే అన్నట్టు సమాచారం.




### అక్కడి కాకి ఇక్కడ వాలొద్దు

మంత్రివర్గంలో బెర్తు కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య చిచ్చు రేపింది. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా పార్టీ అధికారంలోకి వస్తే.. 'మంత్రి పదవి గ్యారెంటీ' అని కాంగ్రెస్ పెద్దలు రాజగోపాల్‌రెడ్డికి హామీ ఇచ్చారట. అయితే పార్టీకి విధేయుడిగా ఉన్నారనే కారణంతో మంత్రి పదవి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దక్కింది. అప్పటి నుంచి తనకు దక్కాల్సిన మంత్రి పదవిని అన్న ఎగరేసుకుపోయాడని రాజగోపాల్‌రెడ్డి మండిపడుతున్నారట. దీంతో 'ఆ ఇంటి మీది కాకి.. ఈ ఇంటి మీద వాలొద్దు.. ఈ ఇంటి మీద కాకి ఆ ఇంటి మీద వాలొద్దు' అని తమను కలిసే వారికి బ్రదర్స్ వార్నింగ్ ఇస్తున్నట్టు వినికిడి.



### గడ్డానికి మోక్షమెప్పుడో?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే గడ్డం తీస్తానని ఐదేండ్ల కిందట పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి అప్పట్లో శపథం చేశారు. అయితే అప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాకపోవడంతో గడ్డం తీయలేదు. ఎట్టకేలకు ఇటీవల ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎవరు కలిసినా 'గడ్డం ఎప్పుడు తీస్తారు' అని అడుగుతున్నారట. గడ్డం తీయాలని ఆయనకు అనిపించకపోగా.. జగ్గన్న (జగ్గారెడ్డి) మాదిరిగా పెంచాలని ఉందని ఉత్తమ్ చెబుతున్నారట. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలవడం ఒక్కటే కాదు, ఉత్తమ్ మనసులో ఇంకా ఏదో ఉందని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.



### ఇంతకు అన్నది ఎవరి గురించి?

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి జుబ్బా, పైజామా మీద వెయిస్ట్ కోటు ధరించడం అలవాటు. 'అలా ఏం బాగుంటుంది.. గంగిరెద్దులోల్లలాగా ఆ కోటు ఏంటి?' అని అప్పుడెప్పుడో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే మంత్రి అయ్యాక కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్టైల్‌లో వెయిస్ట్ కోటు ధరిస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలో రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. వెంకట్‌రెడ్డిని ట్రోల్ చేస్తున్నారు. అసలే అన్నదమ్ములిద్దరికీ పడటం లేదని గుసగుసలు వినిపిస్తున్న క్రమంలో ఈ ట్రోలింగ్ మరింత గ్యాప్ పెంచేలా ఉందని వారి అనుచరులు వాపోతున్నారు.

- వెల్జాల చంద్రశేఖర్